ఈనాడు జోగులాంబ గద్వాల

మంగళవారం అక్టోబరు 22, 2024

బాల్యానికి పాణిగ్రహణం

ప్రత్యేక అధికారుల నియామకంతో కట్టడికి అవకాశం




అవగాహన కల్పిస్తున్న అధికారులు

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా జోగులాంబ గద్వాల జిల్లాలో బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. వీటి నిర్మూళన కోసం ఐసీపీఎస్ అధికారులు తరచూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా.. పెళ్లిళ్లు అడ్డుకుంటున్నా.. వివాహాల నమోదు తప్పనిసరి చేసినా.. అడ్డుకట్ట పడటంలేదు. ఫలితంగా బాలికలు చదువుకోవాల్సిన వయస్సులో పెళ్లి పీటలెక్కుతున్నారు. ఇలా గుట్టు చప్పుడు కాకుండా ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి.

జిల్లాలో... : బాల్య వివాహాలను అడ్డుకోవడం కోసం 2012లో జీవో నెం.13 ప్రకారం గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలనుప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2017 నుంచి 2024 సెప్టెంబరు వరకు ఐసీపీఎస్ అధికారులు 371 వివాహాలను అడ్డుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇందులో గద్వాల, గట్టు, ధరూర్, మల్దకల్, అయిజ మండలాల్లోనే సగానికి పైగా ఉన్నాయి. 1098, 100, 181 టోల్ ఫ్రీ నంబర్లకు 400 పైగా ఫిర్యాదులు రాగా ఐసీపీఎస్, పోలీసు, రెవెన్యూ అధికారులు వాటిని అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

'బాల్య వివాహాల నిర్మూలన కోసం జిల్లాల్లో బాల్య వివాహాల నిషేధ అధికారుల(సీఎంపీవో)లను ప్రత్యేకంగా నియమించాలి. వారికి ఈ ఒక్క బాధ్యతనే అప్పగించాలి. ప్రత్యేక పోలీస్ విభాగం కూడా ఉండాలి. సామాజిక రుగ్మతను రూపుమాపేందుకు కలెక్టర్లు, ఎస్పీలను భాగస్వామలను చేసి, నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.'

- ఈ నెల 18న సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలివి



గతంతో పోలిస్తే తగ్గుముఖం...: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేస్తున్నాం. ఐసీపీఎస్ అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఫిర్యాదు వస్తే అడ్డుకుంటున్నాం. గతంతో పోలిస్తే జిల్లాలో తగ్గుముఖం పట్టాయి. బాల్య వివాహాల వల్ల బాలికల్లో రక్తహీనత, బరువు తక్కువ పిల్లలు జన్మిస్తున్నారు.



- సుధారాణి, డీడబ్ల్యూవో, గద్వాల

గ్రామ స్థాయిలో పటిష్ఠ పర్చాలి..: గ్రామస్థాయిలో వివాహాల నమోదు బాధ్యతను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. అయితే ఇక్కడ ప్రతి వివాహం నమోదు కావడం లేదు. కల్యాణలక్ష్మి పథకం అవసరమైన వారు మాత్రమే నమోదు చేసుకుంటున్నారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహ నిరోధక కమిటీ ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, యువత సహకారంతో అడ్డుకట్ట వేయాలి. తాజా సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటే ఫలితాలు ఉంటాయని నిపుణుల




జూరాలకు వరద

ధరూరు : జూరాల జలాశయంలోకి వరద కొనసాగుతోంది. జలాశయంలోకి 1.13లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దిగువకు 16గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా మొత్తం 1.16లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 88వేలక్యూసెక్కుల వరద వస్తుండటంతో దిగువకు 91వేల క్యూసెక్కుల వరదను వదులుతున్నారు. రెండు మూడు రోజుల పాటు జూరాలకు వరద కొనసాగే అవకాశం ఉంది.

అక్రమాల దస్త్రం మరుగున పడినట్లేనా?

ధరూరు న్యూస్‌టుడే: గొర్రెల పంపిణీపై గత కొన్ని నెలల క్రితం ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. నెలలు గడుస్తున్న కొద్దీ అక్రమాలపై విచారణ ఊసే కనిపించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నది. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో మరో ముగ్గురు అధికారుల అరెస్టులు తప్ప పెద్దగా విచారణలో పురోగతి కనిపించడం లేదు. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో రీసైక్లింగ్ ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. అధికారులతోపాటు కొందరు గొర్రెల పంపెకందారుల సంఘం అధ్యక్షుల పాత్ర కూడా ఈ అవకతవకల్లో ఉందన్నది స్పష్టం. కాని క్షేత్ర స్థాయిలో దీనిపై ఎలాంటి విచారణ చేపట్టడం లేదు. దీంతో అక్రమార్కులపై చర్యలు ఉంటాయో? లేదోనన్న? అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి.




లబ్ధిదారులకు పంపిణీ చేసిన గొర్రెలు

గొర్రెల్ని సక్రమంగా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అప్పట్లో ఓ అధికారిని సస్పెండ్ చేశారు. గద్వాల జిల్లాలో అధికారులు అనంతపురం వెళ్లి ఏజెంట్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులున్నాయి. నాడు అక్కడ పని చేసిన ఏడీ డబ్బు పంపిణీ వ్యవహారంలో గొడవకు దిగినట్లు ఆరోపణలొచ్చాయి.

కాగ్ గుర్తించిన అంశాలు..

గొర్రెల పంపిణీలో జరిగిన అనేక అక్రమాలను కాగ్ గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 70,688 యూనిట్లు పంపిణీ చేశారు. దీని కోసం ప్రభుత్వ నిధులు రెండు విడుతల్లో రూ.730 కోట్ల వరకు ఖర్చు చేశారు. కాగ్ పరిశీలనలో మహబుబ్‌నగర్ జిల్లాలో 108 గొర్రెలను ఒక కారులో తరలించినట్లుగా రికార్డుల్లో పొందుపరిచినట్లు గుర్తించింది. ఇక్కడ రవాణా వాహనం డీసీఎం నంబరు బదులు కారు నంబరు నమోదు చేశారు.

- ఒకే సమయంలో ఒకే వాహనంలో వేర్వేరు ప్రాంతాల నుంచి గొర్రెలు తరలించినట్లు రికార్డుల్లో నమోదై ఉంది. శ్రీకాకుళం, కడప, కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి కూడా ఇదే వాహనంలో తరలించినట్లు రికార్డుల్లో ఉంది.
- ధన్వాడ మండలానికి వచ్చిన



- పలు నియోజకవర్గాల పరిధిలో విజిలెన్స్ విచారణలో బయటపడిన వాస్తవాలు అందరినీ విస్మయాలనికి గురి చేశాయి. చాలాచోట్ల యూనిట్లే కనిపించని దాన్ని విచారణలో గుర్తించారు. నాగర్ కర్నూల్ జిల్లా మాచర్ల కేంద్రంగా పెద్ద ఎత్తున రీసైక్లింగ్ జరిగినట్లు ఆరోపణలొచ్చాయి.

- వనపర్తి జిల్లాలో కొత్తకోట, మదనాపురం మండలాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. జడ్చర్ల, మానవపాడు ఠాణాల్లో గొర్రెల రీసైక్లింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. అప్పట్లో క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ చేసి నివేదికలు ఇవ్వాల్సిందిగా జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు నివేదికల అధారంగా క్షేత్రస్థాయిలో విచారణగానీ అక్రమార్కులపై చర్యలుగానీ లేవు. అసలు పంపిణీలో అక్రమాలపై విచారణ జరుగుతుందా? దస్త్రం మూసేస్తారా? అన్నదానిపై మాకే స్పష్టత లేదని ఉమ్మడి జిల్లాలో పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పశువైద్యాధికారి చెప్పుకొచ్చారు.

రెండు విడతల్లో పంపిణీ చేసిన గొర్రెలు	
మహబూబ్‌నగర్	16,721
నాగర్‌కర్నూల్	19,127
వనపర్తి	14,511
గద్వాల	10,525
నారాయణపేట	9,804

పీయూ అభివృద్ధికి కృషి

ఉప కులపతి డా.జీఎన్ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉపకులపతి (వీసీ) డా. జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన



వీసీ డా.జీఎన్ శ్రీనివాస్‌కు మొక్క అందిస్తున్న రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు

విశ్వవిద్యాలయానికి రాగా రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీయూకు తాను ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. 29 ఏళ్ల నుంచి తాను బోధనా రంగంలోనే ఉన్నానని, విశ్వవిద్యాలయాన్ని ఎలా అభివృద్ధి చేయాలో తనకు తెలుసని పేర్కొన్నారు. ఎక్కువ మంది గ్రామీణ విద్యార్థులే ఉంటారని, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. విద్యతోపాటు సహపాఠ్య అంశాలు, పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయటంపై దృష్టిసారిస్తామని తెలిపారు. తరగతులు, వసతి గృహాలు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిపాలన, పర్యవేక్షణ తదితర అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. వచ్చే ఏడాది న్యాయ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలలను ప్రారంభిస్తామన్నారు.

రైతేరాజు 6లో..

జిల్లా అధికారులతో శిక్షణ ఏఐఎస్, సీసీఎస్‌లు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాల అధ్యయనం, అమలు తీరుపై అవగాహన పెంపొందించుకునేందుకు యంసీఆర్ హెచ్ ఆర్‌డీ ఇనిస్టిట్యూట్ నుంచి గద్వాల జిల్లా కేంద్రానికి వచ్చిన 25 మంది శిక్షణ అధికారులైన ఆల్ ఇండియా సర్వీసెస్ (ఏఐఎస్), సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (సీసీఎస్) అధికారులతో ఐడీవోసీ



శిక్షణ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు

కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గద్వాల జిల్లా భౌగోళిక స్థితి, నియోజక వర్గాలు, మండలాలు, గద్వాల పట్టు చీరల ప్రాముఖ్యత, జోగులాంబ అమ్మవారి దేవాలయ ప్రసిద్ధి, ఇరిగేషన్ ప్రాజెక్టులు, చరిత్రాత్మక కోట వంటి ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ అధికారుల కోసం 5 గ్రూపులు ఏర్పాటుచేసి, అధికారులకు కేటాయించడం జరిగిందని అన్నారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు నిర్దేశించిన షెడ్యూల్‌కి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ పాల్గొన్నారు.

పంటల సర్వేపై చిక్కుముడి



సాగు పనుల్లో రైతులు (పాతచిత్రం)

కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగుపై డిజిటల్ సర్వే చేయాలని ఏఈవో (వ్యవసాయ విస్తరణ అధికారు)లను ఆదేశించడంతో వారు నిరాకరించడం సర్వే సందిగ్ధంలో పడింది. కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయంపై రూపొందించిన ఈ యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేస్తున్న భూముల వివరాల్ని నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వేకు కేంద్రం నిధులు కేటాయించగా కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ ప్రత్యేక వాలంటీర్లను నియమించి సర్వే చేపడుతోంది. కాగా తెలంగాణలో మాత్రం ఏఈవోలే వీటిని చేయాలంటూ ఆదేశించింది. దీనిని వ్యతిరేకిస్తున్న ఏఈవోలు విధులకు హాజరవుతున్నా గత నెల 24 నుంచి గైర్హాజరు వేస్తున్నారు. విధులను ఖాతారు చేయని అవుట్ సోర్సింగ్ ఏఈవోలను విధుల నుంచి తొలగిస్తామని మెమోలు జారీ చేశారు. దీంతో రెగ్యులర్ ఏఈవోల్లో ఆందోళన నెలకొంది. అయినప్పటికీ సర్వే మాత్రం ముందుకు సాగడం లేదు.

- గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న వారి వివరాలే కాకుండా సాగులోకి వస్తున్న భూములు, పంటలు వంటివి డిజిటల్‌లో నమోదు చేయడం వల్ల వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి పట్టు సాధించడం వీలవుతుందని ఈ సర్వేను నిర్దేశించారు. ఇప్పటి వరకు ధరణి నమోదు ఆధారంగా గ్రామాల్లో వీఆర్ఏ, కావలికారు వంటివారి సహకారంతో రైతు చెప్పిన విధంగా పంటల సాగును వ్యవసాయశాఖ నమోదు చేసేది. వీటన్నింటికీ చెక్‌పెడుతూ సర్వే నంబర్, సాగు ఫొటో ఆధారంగా పంటలు నమోదు చేస్తారు. ఈ సర్వే వివరాల ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను ఇద్దామని యోచిస్తోంది.

ఒక్కరికి అసాధ్యమే ! : గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి అక్కడి నుంచే ఫొటోలతో ఆయా రైతు వివరాలను నమోదు చేయాలంటే ఒక్క ఏఈవోల తోనే సాధ్యమయ్యే పనికాదని వారు చెబుతున్నారు. తమకు సహాయంగా మరొకరిని ఇస్తే గాని గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేయలేమన్నది వారి వాదన. ఏఈవోలుగా స్త్రీలు పని చేస్తున్నారని ఒక్కరే అడవులు, చెరువులు, కుంటలు తిరుగుతూ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడం సులభమైన పని కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంటి అటవీ ప్రాంత వ్యవసాయ క్షేత్రాల్లో ఇది మరింత ఇబ్బందికరమని మహిళా ఏఈవోలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖలో 49 రకాల పనుల్ని చక్కబెడుతున్న తమకు డీటీఎస్ తీవ్ర ఇబ్బందులు కలిగించే అంశంగా వారు భావిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో వీరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదు. అందులోనే వ్యక్తిగత హాజరు నమోదు చేయాలని నిర్దేశించినప్పటికీ ఈ విధులకు దూరంగా ఉంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో రైతులు సాగు చేసిన భూమి వివరాలు...

జిల్లా	రైతులు	సాగు భూములు (ఎకరాల్లో)
నాగర్‌కర్నూల్	1,26. 549	5,62,299
నారాయణ పేట	1,38,267	4,64,440
జోగులాంబ గద్వాల	2,58,901	3,40,677
మహబూబ్‌నగర్	1,76,474	3,21,512
వనపర్తి	1,30,894	2,35,250
మొత్తం	8,31,085	19,24,178

అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: తమ ప్రాణాలను అడ్డుగా పెట్టి ప్రజా రక్షణలో నిమగ్నమై అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. గద్వాలలోని పోలీసు పరేడ్ మైదానంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినో



గద్వాల కవాతు మైదానంలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, పోలీసు బృందం

త్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీలతో పాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ నరేందర్ రావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛంతో ఘన నివాళి అర్పించారు. కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ.. అమరులైన పోలీసు త్యాగాలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. అంతకు ముందు ఏడాది కాలంలో దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 214 మంది పోలీసు అమరవీరుల పేర్లను స్మరిస్తూ అదనపు ఎస్పీ గుణశేఖర్ చదివి వినిపించారు. అనంతరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, యువకులు రక్తం దానం చేశారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరెడ్డి, గద్వాల, అలంపూర్, శాంతినగర్ సీఐలు టంగుటూరి శ్రీను, రవిబాబు, టాటాబాబు, ఆయా ఠాణాల ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు తక్షణమే పరిష్కరించండి

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో సమస్యల పరిష్కారం దిశగా నిర్వహించే ప్రజావాణిలో వినతులు ఇచ్చాం.. పరిష్కారం చూపాలంటూ ఫిర్యాదుదారులు కలెక్టర్ సంతోష్‌కి మొర పెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా 40 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు పాలనాధికారులు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో రామచందర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు భరోసా

ఆర్బీఎస్‌కే ద్వారా విద్యార్థులకు వైద్యసేవలు

న్యూస్‌టుడే, పాలమూరు : ప్రభుత్వ పాఠశాలల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్‌కే) అండగా నిలుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 7, నాగర్‌కర్నూల్‌లో 10, నారాయణ పేటలో 5, వనపర్తిలో 8, జోగులాంబ గద్వాల జిల్లాలో 5 చొప్పున మొత్తం 35 ఆర్బీఎస్‌కే వైద్య బృందాలు పని చేస్తున్నాయి. ప్రతి బృందంలో ఇద్దరు వైద్యులు (ఆడ, మగ), ఒక ఫార్మసిస్టు, ఏఎన్ఎం ఉంటారు. వారికి వాహన సౌకర్యం కూడా ఉంటుంది. బృందాల సభ్యులు వారంలో ఐదు రోజులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సమీపంలోని ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు.

రక్తహీనత బాధితులే ఎక్కువ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,48,556 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అందులో అనేక రకాల అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న 6,143 మంది చిన్నారులను గుర్తించారు. వారిని మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహించే డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డైక్)కు పంపించారు. వివిధ విభాగాలకు చెందిన 13 మంది వైద్యులు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. చిన్నారుల్లో తీవ్ర రక్తహీనత, దంత సంబంధ సమస్యలు, పోషకాహారలోపం ఎదుర్కొంటున్నవారు ఎక్కువ మంది ఉన్నారు.



మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : మా వైద్య బృందాలు రోజూ పాఠశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రతి శనివారం అనారోగ్య బాధితుల వివరాలు మాకు సమర్పిస్తారు. చిన్నారులను కూడా మహబూబ్‌నగర్‌కు తీసుకొస్తారు. వారి అనారోగ్య సమస్యలు పూర్తిగా నయమయ్యే వరకు మెరుగైన చికిత్సలు అందిస్తాం. ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం.

- దేవీదాసు, ఆర్బీఎస్‌కే మేనేజర్, మహబూబ్‌నగర్ జిల్లా

చిన్నారుల అనారోగ్య సమస్యలివే..

అనారోగ్య సమస్య	బాధితులు
తీవ్ర రక్తహీనత	692
దంత సమస్యలు	682
పోషకాహారలోపం	386
దృష్టిలోపం	156
మాట్లాడలేకపోవడం	156
రుతుచక్ర సమస్యలు	151
నరాలు, ఎముకలు	145
బుద్ధి మాంద్యం	51
ప్రవర్తన సమస్యలు	39
గుండె సమస్యలు	32
అభ్యసన వైకల్యాలు	26
నిరాసక్తత	18
గ్రహణ మొర్రి	14
రక్తమార్పిడి	07
వంకర కాళ్లు	06
కర్ణభేరి సమస్యలు	02

కార్మికుల కష్టాన్నీ వదలం..!

త్రిఫ్టు నిధిలో దళారులు, అధికారుల చేతివాటం

రాజోలి, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించిన త్రిఫ్టు పథకం నిధుల్లో పలువురు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,240 జియో ట్యాగ్ మగ్గాలుండగా, 7,150 మంది కార్మికులు త్రిఫ్టు ఫండ్(నేతన్నకు చేయూత) పథకం ద్వారా ఆర్డీ-1 ఖాతాలో కొంత డబ్బు జమ చేస్తే.. ప్రభుత్వం దానికి రెండింతలు ఆర్డీ-2 ఖాతాలో జమ చేసింది. ఆగస్టుతో మూడేళ్ల కాల పరిమితి తీరడంతో మూడింతల డబ్బును అందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు రూ.35 కోట్లకు పైగా నిధులు కార్మికుల సేవింగ్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ పథకం నిధులను తీసుకునేందుకు జిల్లా అధికారులు క్లియరెన్స్ లెటర్లు ఇవ్వడంతో కొందరి చేతివాటం ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కొందరు దళారులు కార్మికులు కట్టిన డబ్బు బ్యాంకుల్లో జమ చేయకుండా వాడుకున్నారు. మరికొందరు వచ్చిన డబ్బులో కొంత వసూలు చేస్తుండటంతో నేతన్నలు లబోదిబోమంటున్నారు. రాజోలిలో ఓ వ్యక్తి కార్మికుల నుంచి ప్రతి నెలా డబ్బు వసూలు చేసి కట్టకుండా సొంతానికి వాడుకున్నాడు. 50 మందికి పైగా నేతన్నలకు సంబంధించిన రూ.లక్షకు పైగా నగదు వాడుకున్నట్లుగా సమాచారం. ఇవి కట్టకపోవడంతో ప్రభుత్వం ద్వారా అందాల్సిన రెండింతల డబ్బు(రూ.2లక్షలు) అందకుండా పోయాయి. ఇలా మొత్తం రూ.3 లక్షలు నష్టపోయారు.

డబ్బు వసూలు : బ్యాంకు అధికారులు ఒక్కో ఖాతా పరిశీలించి నగదు జమ చేయాల్సి ఉండటంతో జాప్యం జరుగుతోంది. ఇదే అదునుగా దళారులు రంగంలోకి దిగారు. ఇన్నాళ్లు బ్యాంకుల చుట్టూ తిరిగాం. తమకు కొంత డబ్బు ఇవ్వాలంటూ కార్మికులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వ సొమ్మే కదా.. తమకు ఖుషీగా కొంత ఇవ్వాలని శాఖ అధికారులు డబ్బు వసూలుకు పాల్పడుతున్నట్లు సమాచారం. గద్వాలలో కొందరు కార్మికుల నుంచి రూ.5-10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. కొందరు దళారులు కార్మికులకు తెలియకుండా నేతన్నల ఖాతాల్లో ప్రతి నెల డబ్బు కట్టినట్లు సమాచారం. ఒక్కో వ్యక్తి 20-50 ఖాతాల్లో డబ్బు కట్టడంతో ప్రస్తుతం రూ.లక్షలు తీసుకునేందుకు కొందరు బ్యాంకు, చేనేత అధికారులను మచ్చిక చేసుకునే పనిలో పడ్డట్లుగా తెలుస్తోంది. ప్రశ్నించిన కార్మికులకు మూడులో ఒక వంతు మీకు.. రెండు వంతులు మాకు అన్నట్లుగా చెబుతున్నారని కార్మిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.

- త్రిఫ్టు పథకం నిధులకు సంబంధించి రూపాయి కూడా అధికారులు, దళారులకు చెల్లించొద్దు. కార్మికుల నుంచి ఎవరైనా వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. రాజోలిలో ఓ వ్యక్తి కొంత డబ్బు వాడుకున్నట్లుగా తమ దృష్టికి వచ్చింది. మిగిలిన ప్రాంతాల్లో వసూలు చేస్తున్నట్లుగా ఫిర్యాదులు అందలేదు.

-గోవిందయ్య, జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు

ఒక్కొక్కరుగా దూరమై.. జీవనం భారమై!

మానవీయం

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే : అమ్మానాన్నలు, సోదరుడు, తాత, నానమ్మలను వరుసగా కోల్పోయి ఓ యువతి అనాథగా మిగిలిన దయనీయ గాథ ఇది. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చెందిన బి.రాములుది పేద కుటుంబం. ఆయనకు భార్య జయమ్మ, తండ్రి అనంతయ్య, తల్లి మాసమ్మ, కుమారుడు సాయికిరణ్, కుమార్తె స్నేహ ఉన్నారు. కూలి పనులతో వచ్చే అరకొర ఆదాయంతో జీవనం సాగించే ఆ కుటుంబాన్ని మధుమేహం కబలించింది. తాము మధుమేహం బారినపడ్డామన్న విషయాన్ని రాములు, జయమ్మ ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే పరిస్థితి చేయిదాటి అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. 2014లో జయమ్మ చనిపోయారు. మరుసటి సంవత్సరం రాములు మరింత అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రి ఖర్చులకు ఎకరం పొలాన్ని అమ్మినా ఫలితం లేకపోయింది. 2016లో ఆయన మృతిచెందారు. అమ్మానాన్నలు లేకున్నా అన్న, తాత, నానమ్మ ఉన్నారని స్నేహ అనుకున్నంతలోనే మరొకరిని కోల్పోవాల్సి వచ్చింది. కుమారుడు, కోడలును కోల్పోయిన దిగులుతో వృద్ధుడైన అనంతయ్య 2017లో మరణించారు. కొంతకాలానికి అన్న సాయికిరణ్ అనారోగ్యం పాలయ్యారు. 2024 ఆగస్టు 26న ఆయన చనిపోయారు. వృద్ధాప్యంతో నానమ్మ మాసమ్మ 2024 సెప్టెంబరు 16న మరణించారు. నెల వ్యవధిలోనే అన్న, నానమ్మ దూరమయ్యారు. విధి పగబట్టినట్లుగా కుటుంబంలోని ఒకరి తర్వాత మరొకరిని.. మొత్తం ఐదుగురిని బలి తీసుకోవటంతో స్నేహ అనాథగా మారింది. ఆమెను తీవ్రంగా కుంగదీసింది. ప్రస్తుతం స్నేహ మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. ఉన్నత విద్య అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఆమె కలలన్నీ కరిగిపోయి కన్నీరే మిగిలింది. కుటుంబ సభ్యులను తలచుకుని దుఃఖిస్తూ.. శిథిలావస్థకు చేరిన పాత పెంకుటిల్లులో బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అనాథగా మారిన స్నేహకు ప్రభుత్వం అండగా నిలవాలని, ఆమెను వసతి గృహంలో చేర్పించి ఉన్నత విద్య చదివించటంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


తల్లిదండ్రుల చిత్రపటంతో స్నేహ

బంతి తోట.. లాభాల బాట

రైతేరాజు

ధన్వాడ, న్యూస్‌టుడే : గాలి ఉన్నప్పుడే తూర్పార బట్టాలి అనే నానుడిని వంట బట్టించుకున్న నారాయణపేట జిల్లా మరికల్‌కు చెందిన మహిళా రైతు పోలమోని లక్ష్మమ్మ.. బంతి పూలసాగులో ప్రణాళికతో ముందుకెళ్తూ ఏటా లాభాలు అందుకుంటున్నారు. ఈమెకు 2.30 ఎకరాల పొలం ఉంది. ఓ చోట రెండెకరాలు, మరో చోట 30 గుంటల భూమి ఉంది. ఇందులో అర ఎకరాలో బంతిపూలు సాగు చేశారు. బతుకమ్మ వేడుకలు ప్రారంభానికి నలభై రోజుల ముందు నారు నాటుతారు. పూల దిగుబడి అప్పటి నుంచి మొదలైతే దీపావళి, కార్తిక పౌర్ణమి వరకు కొనసాగుతుంది. ఈ సీజన్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది.

ఖర్చు రూ.20 వేలు.. లాభం రూ.50 వేలు: నారు నాటినప్పటి నుంచి పూలు చేతికి వచ్చే వరకు రూ.20 వేలు ఖర్చు అవుతుందని లక్ష్మమ్మ తెలిపారు. తొలి కాపు పూలు విక్రయించగా చేతికి రూ.30 వేలు దక్కాయని, పెట్టుబడి పోగా రూ.పది వేలు ఆదాయం వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం రెండో కాపులో పూలు విరగకాశాయని వీటిని విక్రయిస్తే కనిష్ఠంగా మరో రూ.40 వేలు లాభం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నీటి తడులు అందిస్తే మూడో కాపు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పూలకు డిమాండ్ ఉంటే మరో రూ.30 వేలు వస్తాయన్నారు. గతేడాది మూడు కాపులు బాగా కాశాయని ఆమె తెలిపారు.


తోటలో రైతు లక్ష్మమ్మ

గత ఏడాది రూ.లక్ష వరకు విక్రయాలు:
నా పొలం పట్టణానికి సమీపంలో ఉండటంతో రోజూ నా భర్త ఉదయం, సాయంత్రం వెళ్లి పర్యవేక్షిస్తారు. బంతిపూల సాగుకు శ్రమ పడాల్సిన అవసరం ఉండదు. గతేడాది రూ.లక్ష వరకు విక్రయాలు జరిగాయి. పెట్టుబడి పోగా రూ.80 వేలు దక్కాయి. ఈ సారి రెండో కాపు వరకు రూ.70 వేలు చేతికి దక్కుతాయి. మూడో కాపులో డిమాండ్ ఉంటే రూ.లక్ష వరకు అమ్మకాలు జరుగుతాయి.
- పోలమోని లక్ష్మమ్మ, మరికల్

ముర్రుపాలు దూడలకు మేలు

బాలానగర్, న్యూస్‌టుడే : లేగ దూడలకు పోషణపరంగా శ్రద్ధ తీసుకుంటే అవి సకాలంలో మంచి పాడిపశువులుగా ఎదుగుతాయని పశువైద్యాధికారి రఘురాం కుమార్ తెలిపారు. చూడి పశువులకు ఏడో నెల నుంచే అదనంగా దాణా ఇవ్వాలని సూచించారు. దూడల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొందించేందుకు రోజుకు రెండు, మూడు సార్లు చొప్పున మొదటి మూడు రోజులు ముర్రుపాలు తాగించాలి. పుట్టిన గంటలోపే ఇవ్వాలి. తాగలేని దూడలకు తల్లి వద్ద నిలబెట్టి తాగేలా సహకరించాలి. లేదంటే సీసాలో పోసి పాల పీక అమర్చి తాపాలి. వీటిలో శక్తినిచ్చే పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా దూడలను వ్యాధుల బారి నుంచి రక్షించే 'అంటినాడిస్' ఇందులో ఉంటాయి. వీటిని తాగని దూడల్లో పారుడు వ్యాధులు, ఏలిక పాములు ఆశిస్తాయి. వీటి వల్ల దూడలకు మలబద్ధకం సమస్య ఉండదని రఘురాం కుమార్ తెలిపారు.

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

మేలైన వంగడాల ఎంపిక కీలకం

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే : రబీలో మేలైన వంగడాలు ఎంచుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేశ్ సూచించారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురవడంతో ఎలాంటి నీటి సమస్య ఉండదని తెలిపారు. రైతులు ప్రస్తుతం నాణ్యమైన ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలు ఎంచుకోవాలని ఆయన పేర్కొన్నారు.

● వరిలో అగ్గి తెగులును తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు ఎంచుకోవాలి. ఇందులో స్వల్పకాలిక (120 రోజులు) రకాలు ఎంచుకుంటే మేలు. కాటన్ దొర సన్నాలు (ఎంటీయూ-1010), విజేత (ఎంటీయూ-1001), ఐఆర్-64, ప్రభాత్ (ఎంటీయూ-3626), నెల్లూరి మసూరి (ఆర్‌పీఎన్ఆర్-34449), తెల్లహంస (ఆర్ఎన్ఆర్-10754), ఎర్రమల్లెలు (డబ్ల్యూఎల్-20471), జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798) మంచి ఫలితాలు ఇస్తాయి. ● జగిత్యాల సాంబ, అంజన, శ్వేత, తరంగ్, తెలంగాణ సోనా, బతుకమ్మ వంటి రకాలు సాగుకు అనుకూలం. ● మొక్కజొన్న, వేరుసెనగ, పప్పు శనగ, పొద్దుతిరుగుడు, మినుములు, నువ్వులు, ఆవాలు, రాగి, తెల్లజొన్న, ఉలువ, పెసర వంటి పంటలు సాగు చేసుకోవచ్చు. అపరాల సాగు లాభదాయకంగా ఉంటుంది. ● ఉల్లి సాగు ఎంతో లాభదాయకం. ఎకరానికి సుమారు 100-150 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. మార్కెట్లో ఇప్పుడు మేలైన వంగడాలు వచ్చాయి. ఎరుపు రంగు గడ్డకంటే లేత ఎరుపు రంగు ఉల్లికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎలాంటి మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు.


ఉల్లి సాగు

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో పాము పొడ తెగులు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- మాసన్న, దుప్పల్లి
✔ లీటరు నీటికి థప్లూజమిడ్ 0.75 మి.లీ లేదా హెక్సాకోనోజోల్ 2 మి.లీ లేదా ప్రొపికోనోజోల్ 1 మి.లీ లేదా ట్రైఫ్లాక్సీస్ట్రాబిన్ + టెబ్యూకోనోజోల్ 0.4 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? వేరుసెనగలో పొగాకు లద్దె పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- బాలరాజు, నిర్వేన్
✔ న్యూవులురాన్ 1 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటాలో ఆకుమాడు తెగులు నివారణకు చర్యలు తెలపండి
- వెంకటయ్య, చెన్నారం
✔ లీటరు నీటిలో కాప్టాన్ 3 గ్రాములు లేదా కార్బండిజియం + మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా ప్రొపికోనోజోల్ ఒక మి.లీ లేదా అజాక్సిస్ట్రోబిన్ + టెబ్యూకోనోజోల్ 1.2 మి.లీ మందును కలిపి ఆకులు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.


- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం
- న్యూస్‌టుడే, మదనాపురం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యకు కృషి

సినీనటి మంచు లక్ష్మి

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, మౌలిక వసతుల కల్పనకు తమ సంస్థ కృషి చేస్తోందని టీచ్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, సినీనటి మంచు లక్ష్మి పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆలూరు గ్రామంలో డిజిటల్‌క్లాస్ నిర్మాణం ప్రారంభించేందుకు వచ్చిన ఆమె సోమవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పెగసిస్ సిస్టం కంపెనీ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. గతంలో గట్టు మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌ల నిర్మాణం చేపట్టామని.. త్వరలో మరో 20 పాఠశాలలు నిర్మిస్తామని ఆమె చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంస్థ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 140 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ, డీఈవో రవీందర్‌లు పాల్గొన్నారు.


గద్వాల కలెక్టర్ సంతోష్‌తో మాట్లాడుతున్న సినీనటి మంచు లక్ష్మి

శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌ల పర్యటన


ఉండవల్లి బస్వాపురంలో శిక్షణ అధికారులకు పూలమొక్కలు అందజేసి, బతుకమ్మతో స్వాగతిస్తున్న అధికారులు

ధరూరు, ఉండవల్లి, మానవపాడు, ఇటిక్యాల, న్యూస్‌టుడే: ధరూరు మండల పరిధిలోని ఉప్పేరులో శిక్షణ ఐఏఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాదు, జోగులాంబ గద్వాల జిల్లాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామానికి 5 మంది చొప్పున 125 మంది శిక్షణ అధికారులు వచ్చారు. 3 రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులు, కనీస వసతుల కల్పన తదితర అంశాలపై నివేదిక రూపొందించనున్నారు.

● ఉండవల్లి మండలం బస్వాపురం గ్రామానికి శిక్షణ అధికారులు లోకేష్‌కుమార్ (ఐఏఎస్), రామకృష్ణ శరన్ (ఐపీఎస్), ప్రతీక్ గహ్లోట్(ఐపీఎస్), అతుల్ కుమార్‌సింగ్ (ఐఆర్ఎస్ ఐటీ), హిమాన్షు త్యాగి (ఐఎఫ్ఓఎస్) సోమవారం వచ్చారు. మానవపాడు మండలానికి 5 మంది శిక్షణ ఐఏఎస్ అధికారులు రాజీవ్.కె, వల్లి.ఎన్, ప్రసన్నకుమార్.వి, విజయ్ లధా, సాయలి అశోక్ గైక్వాడ్‌లు మండలంలోని కలుకుంట్ల గ్రామానికి సోమవారం చేరుకున్నారు. ఇటిక్యాల మండలంలోని కోదండాపురంకు సోమవారం శిక్షణా సివిల్ సర్వీస్ అధికారులు వచ్చారు. 2021 బ్యాచ్‌కు చెందిన లోకేష్ యాదవ్ (ఐపీఎస్), డింపుల్ యాదవ్(ఐఏఎస్), బస్వారాజ్ ఎం వాలీకర్(ఐపీవోఎస్), నిఖితా యాదవ్(ఐసీఎల్ఎస్), 2022 బ్యాచ్‌కు చెందిన ఇంద్రజిత్ సిరా(ఐఎఫ్‌వోఎస్)లు ఉన్నారు. మల్దకల్ మండల పరిధిలోని పెద్దతాండలో శిక్షణ ఐపీఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. వికాస్, పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి, ఐఎఫ్ఓఎస్ ఆదాం మోహియిద్దీన్, ఐపీఓఎస్ పుష్కర వర్మ, ఐపీఎస్ హర్షత్‌కుమార్ ఆలావాత్, తాండాలో పర్యటించి ఆర్థిక, సామాజిక అంశాలపై ముచ్చటించారు.

శ్రీశైలంలో నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువన ఉన్న జూరాల, సుంకేశుల జలాశయాలు పూర్తిగా నిండటంతో దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ప్రాజెక్టు 5 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి 1,17,539 క్యూసెక్కులు, సుంకేశుల జలాశయం నుంచి 51,324 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. శ్రీశైలం కుడి ఎడమ జల విద్యుత్ కేంద్రాల ద్వార 66,203 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వార 1,38,770 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటి మట్టం 884.30 అడుగులకు, నీటి నిల్వ 211.4759 టీఎంసీలుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కొలువులు ఇచ్చే కొత్త కోర్సులు


● టాటా సంస్థ భాగస్వామ్యంతో మూడు ఐటీఐల్లో అమలు
● 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ


ఐటీఐ కళాశాలలో కొత్త కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న యువతులు

న్యూస్‌టుడే, పాలమూరు: విస్తృత ఉపాధి అవకాశాలు లభించే ఆరు అధునాతన సాంకేతిక కోర్సులు పాలమూరు యువతకు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం దిగ్గజ కంపెనీ టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 65 ప్రభుత్వ ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలు (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ - ఏటీసీ)గా ఉన్నతీకరిస్తున్నారు. తొలి విడతగా ఈ ఏడాది 28 కళాశాలలు ఎంపిక చేయగా అందులో మహబూబ్‌నగర్(బాలికల), మన్ననూర్, వనపర్తి ఐటీఐలు ఉన్నాయి.

ఒక్కో కళాశాలలో 172 సీట్లు : ఒక్కో కళాశాలలో ఆరు కొత్త కోర్సుల్లో కలిపి 172 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యువత ప్రవేశాలకు అర్హులు. ఈ నెల 30 వరకు దరఖాస్తులను అంతర్జాలం నుంచి స్వీకరిస్తారు. తర్వాత కోర్సులు ప్రారంభమవుతాయి. ఉమ్మడి జిల్లాలో బాలికల ఐటీఐ కళాశాల మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే ఉంది. ఈ కోర్సుల్లో మూడేళ్ల పాటు టాటా ప్రతినిధులే శిక్షణ ఇస్తారు. తర్వాత వివిధ పరిశ్రమల్లో వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తారు. ఎస్ఎస్‌సీ, కుల, బోనఫైడ్, స్థానికత ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ఫొటో స్కాన్ చేసి http://iti.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

23న పనులకు శంకుస్థాపన : మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రాంగణంలో బాలికలు, బాలురకు వేర్వేరుగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు వెచ్చించే నిధులను 85 శాతం టాటా, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. వాటిలో అన్ని రకాల యంత్ర సామగ్రి, పరికరాలు, ఫర్నిచర్, ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ఈ పనులకు ఈ నెల 23న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మహబూబ్‌నగర్‌లో శంకుస్థాపన చేయనున్నారు.



సద్వినియోగం చేసుకోవాలి.. : రాబోయే కాలంలో భారీ డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకుంటే కొలువులు లభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం, టాటా కంపెనీ కలిసి నిర్వహించే ఆరు కొత్త కోర్సులను ఉమ్మడి జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలి. అర్హులందరూ త్వరగా దరఖాస్తు చేసుకోవాలి. సందేహాల నివృత్తికి 83742 50330, 95500 54418, 98484 66028 నంబర్లలో సంప్రదించొచ్చు.


- గోపాల్ నాయక్, ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, మహబూబ్‌నగర్

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

వివరాలు గోప్యంగా ఉంచిన ఉపాధ్యాయులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన బిజినేపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. శాయిన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన చిన్నారుల్లో 15 మంది వాంతులు చేసుకున్నారు. ఉపాధ్యాయులు బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం విద్యార్థులను పాఠశాల వద్ద వదిలిన ఉపాధ్యాయులు ఎంఈవోకు గాని, తల్లిదండ్రులకు గాని సమాచారం ఇవ్వకుండానే సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో కొందరు విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే వేచి ఉన్నారు. గ్రామస్థులు ఆరా తీయడంతో విషయం బయటకు తెలిసింది. ఎంఈవో రఘునందన్‌శర్మను వివరణ కోరగా, విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా తెలిసిందన్నారు. మంగళవారం పాఠశాలను సందర్శించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానన్నారు.


శాయిన్‌పల్లి పాఠశాల వద్ద అస్వస్థతకు గురైన విద్యార్థులు

ఆటో ఢీకొని మహిళ మృతి

ముగ్గురు పిల్లలకు గాయాలు

కృష్ణా, న్యూస్‌టుడే : హిందుపూర్, టైరోడ్ మధ్య ఆటో ఢీకొని కర్రెమ్మ(60) అనే మహిళ మృతి చెందింది. కృష్ణా పోలీసుల కథనం ప్రకారం సోమవారం సాయంత్రం కర్ణాటకలోని శక్తినగర్ నుంచి ప్రయివేటు పాఠశాల విద్యార్థులను హిందుపూర్‌కు ఆటో తీసుకువస్తుండగా మహిళ అడ్డం రావడంతో ఆటో అదుపు తప్పి ఆమెను ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ కర్రెమ్మను ప్రయివేటు వాహనంలో మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలిది గుడేబల్లూర్‌గా పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కతలప్ప తెలిపారు.

బాలికతో వెట్టి.. ఆపై దొంగతనం నెపం

● మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం
● జోగులాంబ గద్వాల జిల్లాలో దారుణం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని ఓ సీడ్ ఆర్గనైజర్ తన ఇంట్లో బాలిక(16)తో వెట్టి చాకిరి చేయించుకోవడంతోపాటు దొంగతనం నెపం మోపడంతో ఆ బాలిక పురుగు మందు తాగింది. సామాజిక మాధ్యమాల్లో సోమవారం వైరల్‌గా మారిన ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గద్వాలలో నివాసం ఉంటున్న సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో గత కొన్నేళ్లుగా పని చేస్తోంది. తన ఇంట్లో బంగారు ఆభరణాలు పోయాయని, ఇంట్లో పని చేసే బాలికే ఈ పనికి పాల్పడిందని మల్దకల్ ఠాణాలో ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఠాణాకు పిలిపించి విచారించారు. తర్వాత చోరీ ఘటన తమ పరిధిలో లేదంటూ సీడ్ ఆర్గనైజర్‌కు వివరించారు. తాను దొంగతనం చేయకున్నా నింద మోపారని మనస్థాపం చెందిన బాలిక ఈనెల 12న తన ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను కుటుంబ సభ్యులు గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఏపీలోకి కర్నూలుకు తీసుకెళ్లారు. బాలిక ఆరోగ్యం మరింతగా విషమించడంతో వైద్యులు ఏఎంసీలో ఉంచి వెంటిలేటరుపై చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో బాలిక తల్లి మల్దకల్ ఠాణాలో ఇంటి యజమానిపై ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గద్వాల డీఎస్పీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా సంఘటనపై విచారణ జరుపుతున్నామని, బాలిక తల్లి ఫిర్యాదుపై వెట్టిచాకిరి చేయించుకుని దొంగతనం నెపంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సీడ్ ఆర్గనైజర్‌పై మల్దకల్ ఠాణాలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రైలు కింద పడి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉండే గుర్తుతెలియని పురుషుడు బండమీదిపల్లి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులు ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ.10గం. నుంచి మ.1 వరకు

గద్వాల గ్రామీణం: 9052211532 అలంపూర్: 8008573916
అయిజ: 8008573922 అలంపూర్ పట్టణం: 8008573930

సమస్య : తుమ్మిళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులే ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
– మధు, ఓ విద్యార్థి తండ్రి

పరిష్కారం : ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.
– భగీరథరెడ్డి, ఎంఈవో, రాజోలి

– న్యూస్‌టుడే, రాజోలి

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీసీ సినిమాస్... దేవర, విశ్వం, జనక అయితే గనక, శివసాయి : దేవర, భువనేశ్వర్ : విశ్వం
మాధవ్ : వేట్టయన్
– న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

సుంకేసుల గేట్ల ద్వారా 51,300 క్యూసెక్కుల నీటి విడుదల

రాజోలి, న్యూస్‌టుడే : సుంకేసుల జలాశయం గేట్ల ద్వారా సోమవారం 51,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కేసీ కాల్వకు 2 వేల క్యూసెక్కులు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 54,200 క్యూసెక్కుల నీరు చేరుతోందని, 291.40 మీటర్ల నీటిమట్టం ఉందని చెప్పారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే : మల్దకల్ మండలం ఓ గ్రామానికి చెందిన బాలిక(16)పై అక్రమంగా దొంగతనం కేసు మోపి ఆత్మహత్యా యత్నానికి కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను ఆయన పరామర్శించారు. వెంటనే పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి కారకులైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఎం మహా సభలను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉండవల్లి, న్యూస్‌టుడే : ఈ నెల 25, 26వ తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని నాయకుడు సింగరాజు మద్దిలేటి పిలుపునిచ్చారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలో పార్టీ నాయకులు మహా సభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, చిన్న నరసింహ, స్వాములు, హర్షగౌడ్, సురేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రూ.36లక్షలతో క్రికెట్ మైదానం అభివృద్ధి
రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : దాతల సహకారంతో రూ.36లక్షల నిధులు వెచ్చించి మహబూబ్‌నగర్‌లోని జిల్లా క్రికెట్ సంఘం(ఎండీసీఏ) మైదానం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్ పిచ్‌లకు హైదరాబాద్ క్రికెట్ సంసం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావుతో కలసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎండీసీఏ మైదానంలో పవేలియన్, విశాలమైన హాలు, జిమ్, కిచెన్ నిర్మించనున్నట్లు వెల్లడించారు.

● హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో హెచ్‌సీఏకు ఉప్పల్ తర్వాత ఉన్న ఏకైక మైదానం మహబూబ్‌నగర్‌లోనిదేనని తెలిపారు. ఈ మైదానంలో మూడు టర్ఫ్ వికెట్ పిచ్‌లు, గ్రీన్ గ్రాస్, వర్షపునీరు నిలవకుండా భూగర్భ డ్రైనేజీ తదితరాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రంజీ క్రీడా టోర్నీలు నిర్వహించేలా తీర్చిదిద్దుతామన్నారు. త్వరలో రాష్ట్రస్థాయి అండర్-14 లేదా అండర్-16 టోర్నీని మహబూబ్‌నగర్‌కు కేటాయిస్తామన్నారు. జిల్లాల్లో క్రికెట్ అకాడమీల ఏర్పాటుకు నిర్ణయించామని, మొదటి ప్రాధాన్యంగా మహబూబ్‌నగర్‌కు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రేకుల షెడ్డు(కన్నోపి) ఏర్పాటుకు రూ.5లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పురపాలిక ఛైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్, ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బస్వరాజ్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

అలంపూర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయించాలనే ఉద్దేశ్యంతోనే భాజపా జమిలి ఎన్నికలకు సిద్ధమైందని సీపీఎం నాయకులు రాజు, ఈదన్న ఆరోపించారు. సోమవారం అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యం, లౌకికతత్వానికి విరుద్ధమని విమర్శించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటున్న భాజపా ఒకే దేశం ఒకే కులం అనగలదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. పట్టణ కార్యదర్శి వెంకటస్వామి, అయ్యప్ప పాల్గొన్నారు.

పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ధరూరు (గట్టు) న్యూస్‌టుడే : పదో తరగతి ఫలితాల్లో ఉన్నత పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా లక్ష్యంగా పెట్టుకోవాలని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. సోమవారం గట్టు ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమై బోధన పద్ధతులపై ఆరా తీశారు. అనంతరం పది విద్యార్థులతో మాట్లాడారు. బోధన సులువుగా అర్థమయ్యే విధంగా ఉందా లేదా అని దానిపై అడిగితెలుసుకున్నారు.

తుంగభద్రలో 48,370 క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్, న్యూస్‌టుడే : తుంగభద్ర నదిలో సోమవారం 48,370 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 11 అడుగుల ఎత్తులో ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధాన కాల్వకు 8.1 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5 అడుగులుగా ఉంది.

పోటీ పరీక్షలతో నైపుణ్యాలు



విజేతలుగా నిలిచిన గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం ఇమ్మానియేల్

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే : గద్వాలలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ప్రతిభా పాటవ' పోటీలు కొనసాగుతున్నాయి. విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుకు 'ఈనాడు' వ్యాసరచన పోటీ పరీక్షలు వేదికగా నిలిచినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో, అబ్రహం ఉన్నత పాఠశాలలో ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు సత్తా చాటారు. బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో శివసాయి, రెండో స్థానంలో పూజిత, తృతీయ స్థానంలో అభి శేఖర్‌రెడ్డిలు నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ ఇమ్మానియేల్ బహుమతులు అందజేశారు. అదే విధంగా అబ్రహం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలో మొదటి స్థానంలో నిఖిల్ తేజ, రెండో స్థానంలో కుందన చరిత, మూడో స్థానంలో హేమశ్రీలు నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ జయమణిపాల్, కరస్పాండెంట్ పాల్‌సుధాకర్‌లు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు మోహన్‌రావు, తాయన్న, సుధామతి, భానుప్రకాశ్, రవికుమార్, వీరేశ్, రాము, లావణ్యలు పాల్గొన్నారు.



అబ్రహం ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ జయమణిపాల్

భళా.. చిన్నారుల కళ

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే : భవిష్యత్తు తరాలకు సంప్రదాయ కళలపై అవగాహన కల్పించాలని, పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో జిల్లా విద్యార్థులు

పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. మూడు బృందాల విద్యార్థులు, వ్యక్తిగత ప్రదర్శనలో ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు నవంబర్ 1, 2వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధిస్తే జాతీయ స్థాయికి ఎంపికవుతారని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిలో కొందరిని 'న్యూస్‌టుడే' పలకరించింది.



బృందంగా విజేతలుగా నిలిచి : ధరూర్ మండలం రేవులపల్లికి చెందిన డీఏవీ మోడల్ స్కూల్ విద్యార్థులు జానపద నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటారు. పదో తరగతి చదువుతున్న అంకిత ఆధ్వర్యంలో రిషిత, కల్యాణి, విశ్వాని, మౌనికల నృత్యం ఆకట్టుకుంది. చిన్నప్పటి నుంచి ఉన్న ఆసక్తితో శాస్త్రీయ, సినిమా పాటల నృత్యాల్లో రాణిస్తున్నామని విద్యార్థులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.
– అంకిత బృందం, రేవులపల్లి



హార్మోనియంతో ప్రతిభ : వాయిద్య సంగీతం విభాగంలో మల్దకల్ మండలం అమరవాయి ఉన్నత పాఠశాలకు చెందిన కేశవర్ధన్ హార్మోనియంతో ప్రతిభ చాటారు. 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి ఇంటి వద్ద ఉన్న ఆలయంలో భజనకు వెళ్తూ హార్మోనియం నేర్చుకున్నారు. అందులో మెలకువలు నేర్చుకొని కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.
– కేశవర్ధన్, అమరవాయి



గానంలో రాణించిన గాయత్రి...: గాత్ర సంగీతం విభాగంలో గద్వాల పట్టణం ప్రగతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని గాయత్రి ప్రతిభ చాటారు. పదో తరగతి చదువుతున్న ఈ బాలిక పాఠశాలలో నిర్వహించే పోటీల్లో తన గానంతో ప్రశంసలు పొందారు. పాటలు పాడటం ఇష్టమని, ముమ్మందు మంచి ప్రదర్శన చేస్తానని చెబుతోంది.
– గాయత్రి



ఆర్ట్ విభాగంలో...: గద్వాల పట్టణంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన శివాణి ఆర్ట్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఏ4 పేపరుపై వికసిత భారత్ కార్యక్రమం ద్వారా భారతదేశం స్పేస్‌లోకి అడుగుపెట్టి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని పిండితో ఆర్ట్ వేసింది. చిత్రాలు గీయడం తన అలవాటని, ఉపాధ్యాయుల సూచనలతో ఆర్ట్ విభాగంలో పాల్గొన్నానని చెప్పారు. రాష్ట్ర స్థాయికి ఎంపికవడం సంతోషంగా ఉందని తెలిపారు.
– శివాణి, గద్వాల

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి



మాట్లాడుతున్న బెటాలియన్ డీఐజీ ఎంఎస్ సిద్దికి

ఇటిక్యాల, న్యూస్‌టుడే : పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని బెటాలియన్ డీఐజీ ఎంఎస్ సిద్దికి అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎర్రవల్లి చౌరస్తాలోని పదో పటాలంలో పటాలం కమాండెంట్ సాంబయ్యతో కలిసి విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బందికి సోమవారం ఆయన నివాళులర్పించారు. అమరుల కుటుంబాలను శాలువాలతో సత్కరించారు. అనంతరం శిక్షణ పొందుతున్న సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ సుబ్రహ్మణ్యం, సహాయ కమాండెంట్ చౌహాన్, ఆర్‌ఐలు రాజారావు, ఆర్‌పీ సింగ్, గోపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పోలీసు అమరులకు నివాళి అర్పిస్తున్న పటాలం సిబ్బంది

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి

అయిజ, న్యూస్‌టుడే : అయిజ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సోమవారం భాజపా నాయకులు ఎస్సై విజయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్త బస్టాండు, పాత బస్టాండు, తెలంగాణ చౌరస్తా, పెట్రోల్ బంక్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో వాహనాల రద్దీ అధికంగా ఉంటుందని, ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో భాజపా పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

మానవపాడు, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీవో శివప్రసాద్ సోమవారం తెలిపారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ చదివిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 8.30కు ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో ఉచితంగా బస్సు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకువెళ్లాలని సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

మానవపాడు, న్యూస్‌టుడే : గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని మానవపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డా. యాకుబ్‌భాషా సూచించారు. వివిధ గ్రామాలకు చెందిన 24 మంది గర్భిణులకు సోమవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రసవాల కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు హెలెన్, అక్కమ్మ, చంద్రన్న, తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సరోజ

అయిజ : లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం నేరమని మహిళా సాధికారత కేంద్రం గద్వాల ఇన్‌ఛార్జి సరోజ అన్నారు. సోమవారం అయిజలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేసుకున్న వారికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది కళావతి, సఖికేంద్రం సిబ్బంది స్వాతి పాల్గొన్నారు.

ముగిసిన ఉర్సు ఉత్సవాలు

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : రామాపురంలో హుజూర్‌స్వామి ఉర్సు ఉత్సవాలు సోమవారం ముగిశాయి. గంధంతో మొదలైన ఈ మహోత్సవంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



మానవపాడు ఎంపీడీవో కార్యాలయం వెనక వైపు ఉన్న ఓ గది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇది గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉండడంతో ఆకతాయిలు తాగేందుకు వాడుకుంటున్నారు. దీన్ని పక్కనే మండల మహిళా సమాఖ్య, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న చోట ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా కార్యాలయాలకు వచ్చే వారు కోరుతున్నారు. మానవపాడు పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. గదిలో పేరుకపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో తొలగిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, మానవపాడు

హంసవాహనం ఇలా ..



ఏటా దేవీ నవరాత్రుల సందర్భంగా దసరా రోజు తుంగభద్ర నదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హంస వాహనంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ప్రదక్షిణలు చేస్తారు. ఇందు కోసం రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన హంస వాహనం నిత్యం నీటిలో ఉండటంతో అధ్వానంగా తయారైంది. ఈ ఏడాది తుంగభద్ర నదిలో నిర్వహించిన తెప్పోత్సవానికి సైతం ఈ వాహనం వినియోగించలేదు. ఏళ్లుగా నదిలో ఉండటంతో నిరుపయోగంగా మారిందని, రూ.లక్షలు వృథా అయినట్లు పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, అలంపూర్

వ్యర్థాలతో ఇక్కట్లు..



అలంపూర్ పురపాలిక పరిధిలోని ఇమాంపురంలో రహదారి పక్కనే ఉన్న వ్యర్థాల దృశ్యమిది. సమీపంలో చెత్త కుండీ ఉన్నప్పటికీ ఇలా పక్కకు పడేస్తున్నారు. వీటి వల్ల వచ్చే దుర్వాసనతో ఆలయాలకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిన సమయంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటోంది. న్యూప్లాట్స్ కాలనీలో సైతం ఇదే సమస్య ఉంది. పురపాలిక సిబ్బంది వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అలంపూర్

భాజపా బలోపేతానికి కార్యకర్తల కృషి అవసరం



సభ్యత్వ నమోదులో భాజపా నేతలు

ధరూరు న్యూస్‌టుడే: భాజపా బలోపేతానికి క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ నేత స్నిగ్ధా రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ధరూరు మండలం కోతులగిద్ద గ్రామంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా ప్రభారీ బోక్కా బాల్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు వార్డు స్థాయి నుంచి అన్ని స్థానాలకు అభ్యర్థులను నిలపడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. గ్రామ నాయకత్వం బలంగా ఉంటేనే రాష్ట్రంలో భాజపాకు అధికారం దక్కుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కన్వీనర్ రామాంజనేయులు, శివారెడ్డి, రాజేశ్, హనిమిరెడ్డి పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో సీపీఎం మహాసభలు



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

మల్దకల్, న్యూస్‌టుడే : ఈ నెల 25, 26వ తేదీలలో గద్వాలలోని అనంత కన్వెన్షన్‌హాల్లో జరగనున్న సీపీఎం పార్టీ మూడవ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా నాయకులు వీవీ నర్సింహ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం మల్దకల్ మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సభలకు ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు ఎంవీ.రమణ హాజరుకానున్నట్లు చెప్పారు.

సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

అయిజ, న్యూస్‌టుడే : సీఎం కప్ క్రీడా పోటీలను అన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో వెంకటయ్య సూచించారు. ఎంఈవో రాములు దయాల్ ఆధ్వర్యంలో సోమవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామస్థాయి పోటీలు, 26 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయి పోటీలు నిర్వహిస్తారని వివరించారు.

రాజోలి, న్యూస్‌టుడే : ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీయడమే లక్ష్యంగా సీఎం కప్ పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని తహసీల్దార్ రామ్మోహన్, ఎంఈవో భగీరథరెడ్డి సూచించారు. సోమవారం రాజోలి ఎమ్మార్సీ కార్యాలయంలో కార్యదర్శులు, పీఈటీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 22వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గ్రామస్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించి, 25వ తేదీ నుంచి జరిగే మండల స్థాయి పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



రాజోలి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో భగీరథరెడ్డి

వివాహిత ఆత్మహత్య



బసమ్మ

ఇటిక్యాల, న్యూస్‌టుడే : పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన షేక్‌పల్లిలో చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్సై స్వాతి కథనం మేరకు.. అమరచింత మండలానికి చెందిన కురువ బసమ్మ(43)కు 15 సంవత్సరాల క్రితం షేక్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. ఐదు సంవత్సరాల తర్వాత కుమార్తె జన్మించి మరణించింది. రెండేళ్ల క్రితం అనారోగ్యం బారిన పడగా గర్భసంచి తొలగించారు. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బందులు పడుతూ..ఆదివారం ఇంట్లో పురుగు మందు తాగారు. కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

ధరూరు న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొతులగిద్ద స్టేజ్ వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా సోమవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్ షుకూర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఇర్కిచేడు గ్రామానికి చెందిన రవీందర్‌నాయక్ (21) కొత్తపాలెం గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

పాఠశాల బస్సును ఢీకొన్న కారు

ఉండవల్లి, న్యూస్‌టుడే : పాఠశాల బస్సును కారు ఢీకొన్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కారులో నలుగురు వ్యక్తులు దిల్లీ నుంచి కేరళకు వెళ్తున్నారు. పుల్లూరు టోల్ ప్లాజా వద్ద సమీప స్కంద కాలనీ నుంచి విద్యార్థులతో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల బస్సు యూటర్న్ తీసుకుంటోంది. ఈ క్రమంలో బస్సు వెనక వైపున కారు ఢీకొంది. కారులో ఉన్నవారు స్వల్పంగా గాయపడగా అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాధామోహన్, పైలట్ దేవేందర్ ప్రథమ చికిత్స అందించారు. బస్సులో ఉన్న విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు.

కుక్క కాటుకు గురైన ఏఎస్సై

అలంపూర్, న్యూస్‌టుడే : అలంపూర్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై ఎస్.ఎమ్ భాషా ఆదివారం రాత్రి అదనపు ఎస్పీ గుణశేఖర్‌తో ఆలయాల దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం వెళ్తుండగా ప్రాంగణంలో ఉన్న కుక్క ఏఎస్సై కాలును గాయపర్చింది. వెంటనే అలంపూర్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు ఠాణాకు ఫోన్ చేసి హెచ్చరించినట్లు సమాచారం. సోషల్ మీడియా నుంచి వార్తను తొలగించాలని ఏఎస్సై కోరినట్లు తెలిసింది.

ఘర్షణలో కేసు నమోదు

ఉండవల్లి : ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఉండవల్లి ఠాణాలో సోమవారం కేసు నమోదైనట్లు మహిళా కానిస్టేబుల్ సంతోషమ్మ తెలిపారు. ఆమె కథనం ప్రకారం... తక్కశిల గ్రామానికి చెందిన నాగశేషులు, శివ కుటుంబాల మధ్య ఉన్న వివాదంలో కోర్టులో కేసు ఉంది. ఆదివారం రాత్రి రాజీ విషయంపై ఇరు కుటుంబ సభ్యులు మాట్లాడుతున్న క్రమంలో ఘర్షణకు దారితీసింది. ఘటనలో నాగశేషులు గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో ఎస్సై మహేష్ కేసు నమోదు చేసినట్లు కానిస్టేబుల్ తెలిపారు.

విచారించి న్యాయం చేయండి



భూమి కబ్జాకు గురైందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే : గద్వాల శివారులోని సర్వే నంబర్ 895, 900లో 11 ఎకరాల 20 గుంటల తమ వ్యవసాయ భూమి ఉండగా.. కొందరు వ్యక్తులు ఆ భూమి తమదంటూ ఓఆర్సీ ఇవ్వాలని గద్వాల ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంపై ఇరువురు కోర్టులో దావా వేశారు. కోర్టులో తీర్పు రాక ముందే పాత తేదీల్లో స్టాంపు పేపరు కొనుగోలు చేసి నకిలీ వీలునామా సృష్టించారు. అనంతరం గద్వాల రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఓఆర్సీ పొంది మొత్తం పొలాన్ని కాజేశారు. దీనిపై పూర్తి విచారణ చేయించి తమకు న్యాయం చేయాలని బాధితుడు నన్నేసాబ్, మహమ్మద్, సుభాన్ కోరారు.

'ఎమ్మెల్యే తక్షణమే రాజీనామా చేయాలి'

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నోనిపల్లి రిజర్వాయర్ ప్యాకేజీ-101లో కమీషన్ల కోసం, ప్యాకేజీల కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే తక్షణమే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని భారాస రాష్ట్ర నాయకులు కురువ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ ద్వారా భూములు కోల్పోయిన వారికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో మల్లికార్జున్, బీచుపల్లి, బాలస్వామి, రామ్‌కుమార్, రాము, రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భారాస రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్

ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభం



రాజోలి ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాజోలి, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభమయ్యాయి. 1 నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు తెలుగు, 8 నుంచి 10వ తరగతి వరకు వారికి గణిత పరీక్షలను నిర్వహించారు. 1.13 లక్షల మంది విద్యార్థులు హాజరు కాగా హెచ్ఎం, ఎంఈవోలు పర్యవేక్షించారు. ఈ నెల 28వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ముందస్తు టీకాలు మేలు

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : పశువులకు గాలికుంటూ నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారిణి డా.పుష్పలత సూచించారు. సోమవారం తనగలలో రెండోరోజు టీకాల శిబిరం నిర్వహించి 35 మంది రైతులకు చెందిన 393 పశువులకు గాలికుంటూ నివారణ టీకాలు వేశారు. వీఎల్‌వో, ఎల్ఎస్ఏలు లతీఫ్, బుచ్చమ్మ, వెంకటమ్మ, కృష్ణ పాల్గొన్నారు.